క్లుప్తంగా

సమయ పాలన తప్పనిసరి



గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. గురువారం ఆయన కుక్కంబాకం గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రీవెన్స్ రోజున వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వినతులపై అలసత్వం చేస్తే చర్యలు తప్పవని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధులకు గైర్హాజరైనా, సమయ పాలన పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ఆలయ వ్యవసాయ భూముల వేలం



వేలంలో పాల్గొన్న స్థానిక రైతులు

నాగలాపురం: మండలంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం దేవదాయశాఖ అధికారి పి.పనిరాజశయన్, ఆలయ కార్య నిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ వ్యవసాయ భూములకు బహిరంగ వేలం నిర్వహించారు. మూడేళ్ల కాలపరిమితితో లీజుకు గాను ఏడాదికి 55,000 చొప్పున దేవస్థానానికి ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు



గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సుందర్‌రెడ్డి దంపతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్లో చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ నేత సుందర్‌రెడ్డి దంపతులు గురువారం భూమి చేశారు. ఆయన మాట్లాడుతూ, తన కుమారుడు రమేష్‌రెడ్డి (దుబాయ్‌లో ఉంటున్నారు) స్వగ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో చదువుల తల్లి విగ్రహం ఏర్పాటుకు పూనుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, దాసు, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాథం, మురళీప్రసాద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి



ఆటోడ్రైవర్‌కు దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో దురుసుగా డ్రైవింగ్ చేసి ప్రజలను భయభ్రాంతుల కు గురిచేసిన ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. తాగిన మైకంలో జనాలపైకి వెళుతున్న ఓ ఆటోడ్రైవర్‌ను గురువారం స్థానికులు పట్టుకుని చితకబాదారు. గాలిగోపురం వద్ద ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో ఓ ఆటోడ్రైవర్ అస్తవ్యస్తంగా ఆటోను నడపడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంతలో ట్రాఫిక్ జామ్ కావడంతో ఆటో డ్రైవర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి వదిలేశారు.

గూడు చెదిరె..



వారంతా కూలి పని చేసుకుని పొట్టపోసుకునే వారు. రేణిగుంట వివేకానంద కాలనీ, సీబీఐడీ కాలనీల్లోని ఇంటి స్థలాలను 22 ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చారు. కుటుంబమంతా కూలి పనిచేస్తామని చెప్పి అప్పులు తెచ్చుకున్నారు. కొన్ని నెలల కిందట తలదాచుకునేందుకు చిన్న చిన్న ఇళ్లు నిర్మించుకున్నారు. ఉన్నట్టుండి గురువారం వంది మందికి పైగా పోలీసులు, కేంద్ర బలగాలు అక్కడ మోహరించాయి. వారివెంటే అధికారులూ ఉన్నారు. వాళ్లంతా ఎందుకొచ్చారా అని ఆ పేద జనం భయపడిపోయారు. అలా చూస్తుండగానే జేసీబీలు వచ్చాయి. పేద దళితులు తలదాచుకుంటున్న 65 ఇళ్లను కూల్చివేశాయి. గుండెలవిసేలా ఆ పేద జనం చేస్తున్న ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి. కానీ అక్కడున్న వారికెవరికీ చెవికెక్కలేదు. ఇంతకీ వాళ్లు చేసిన పాపమేంటి? వారిని ఆదుకునేదెవరు?

– రేణిగుంట







పార్టీ అధినేతను కలిసిన రాజేష్

–ప్రజలకు అండగా నిలవాలని సూచన



పార్టీ అధినేతతో నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: వైఎస్సార్ సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ గురువారం తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమీక్షకు ఆయన హాజరయ్యారు. అనంతరం పార్టీ అధినేతతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తక్కువ సమయంలో గెలుపు వరకు తోడ్పాటునిచ్చిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారని, అలాగే ఎన్నికల్లో చివరి వరకు పోరాడిన పార్టీ శ్రేణులకు అండగా నిలిచి మనోధైర్యాన్ని ఇవ్వాలని అధినేత తనకు సూచించినట్టు రాజేష్ పేర్కొన్నారు.

యోగాతో ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం



యోగా ఆవశ్యకతపై కరపత్రాలను పంచుతున్న పతంజలి యోగా గురువు రమేష్

నాగలాపురం: యోగాతో ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పతంజలి యోగా గురువు రమేష్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా ఆవశ్యకతపై గురువారం గురువారం పట్టణంలో కరపత్ర ప్రచారం చేశారు. రమేష్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణ నిరంతరాయంగా కొనసాగుతుందని, చిన్న పిల్లలు, పెద్దలు స్వచ్ఛందంగా వచ్చి యోగసాధన చేయవచ్చన్నారు. ప్రస్తుతం దాదాపు 50 మంది వరకు శిక్షణ పొందుతున్నారన్నారు. ఎవరైనా తమ గ్రామాల్లో యోగా శిక్షణ శిబిరం ఏర్పాటుకు ఆసక్తి కలిగి ఉంటే తాము సహకరిస్తామన్నారు. అలాగే శుక్రవారం ఉదయం యోగసాధన అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు సంగీత, జయరామ్, యోగసాధకులు పాల్గొన్నారు.

నేడు యోగా దినోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం ఎదురుగా ఉన్న యోగా సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 నుంచి 7గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గురువు మార్కండేయులు తెలిపారు. యోగా సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంతృప్తికర సేవలతోనే గుర్తింపు



సత్యవేడు: రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దార్ రామాంజనేయులు



బుచ్చినాయుడుకండ్రిగ: కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్, డీటీ

సత్యవేడు: ప్రజలకు సంతృప్తికరంగా సేవలందిస్తే ఆయా శాఖల అధికారులకు గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. గురువారం తన కార్యాలయంలో తహసీల్దార్ ఉద్యోగులతో కలిసి రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగులు ఆర్‌ఐ గోపాల్, వీఆర్‌ఓ సుబ్రమణ్యంలకు శాలువాలు కప్పి సన్మానించి తహసీల్దార్ మాట్లాడారు. తాము శాఖాపరంగా 35 రకాల సేవలు అందిస్తున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. విపత్తులు సంభవించినప్పుడు బాధితులను గుర్తించి ప్రభుత్వ సాయం అందించేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ రవిచంద్ర, జూనియర్ అసిస్టెంట్ కళావతి, వీఆర్‌ఓలు ఇళయరాజ, భార్గవ్, ఎం.శేఖర్, రాఘవేంద్ర, విక్రాంత్, సర్వేయర్లు వెంకటేశ్, రంగయ్య, గిరి, రజనీకాంత్, ఈశ్వర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మహ్మద్ పటాన్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. కార్యాలయం చుట్టూ పనులకోసం ప్రజలు ప్రదక్షిణలు చేసే పరిస్థితులు ఉండరాదని, గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భూసర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, టీచర్లు

పిచ్చాటూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు పాఠశాలలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. ఎంఈఓ హేమమాలిని మాట్లాడుతూ, నీటి వృధాను అరికట్టి నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు వల్ల నీటిని ఆదా చేయవచ్చన్నారు. నీటి సంరక్షణపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 యుగంధర్ రాజు, హెచ్‌ఎం గిరిప్రకాష్, ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పీఈటీ అములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత సప్తాహం

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ప్రేక్షకులను అలరింపజేశాయి. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న నిరివ్రామ సప్తగిరి సంగీత సప్తాహం గురువారంతో ఐదో రోజుకు చేరుకుంది. అపురూప వాగ్గేయకార వైభవం పేరుతో తొలుత శ్రీభద్రాచల రామదాస కీర్తనల గోష్ఠిగానం చేపట్టారు. విజయవాడకు చెందిన కేవీ.బ్రహ్మానందం బృందం, హైదరాబాద్‌కు చెందిన వారణాసి జ్యోత్స్న బృందం, హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.కృష్ణవేణి బృందం, విశాఖపట్నంకు చెందిన జి.శారదా సుబ్రమణియన్ బృందం గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న జగన్నాథనాయుడు

తొట్టంబేడు : విద్యతోనే విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును అందుకోగలరని రాచగున్నేరి మాజీ సర్పంచి బొల్లినేని జగన్నాథనాయుడు అన్నారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి ఉన్నత పాఠశాల్లో గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జగన్నాథనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు చంద్రమౌళి నాయుడు, మునిబాబు, మురళి, ప్రధానోపాధ్యాయురాలు గిరిజ, ఉపాధ్యాయులు లింకన్, శాంతకుమారి, ప్రజాప్రగతి ట్రస్టు కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకానుక అందజేత



కిట్లు పంపిణీ చేస్తున్న జగన్నాథం నాయుడు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని రాచగున్నేరి జెడ్పీ హైస్కూల్లో గురువారం విద్యార్థులకు మాజీ సర్పంచ్ జగన్నాథం నాయుడు చేతుల మీదుగా విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, మూడు జతల యూనిఫాం దుస్తులు, బ్యాగులు, బెల్ట్, షూలను అందించారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను వినియోగించుకుని కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్రా చంద్రమౌళినాయుడు, మునిబాబు, మురళి, హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు లింకన్, శాంతకుమారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారి



మలాథియాన్ స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మలాథియాన్‌తో దోమలను నివారించవచ్చని శ్రీకాళహస్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి శివకుమార్ అన్నారు. ఏర్పేడు బీసీ హాస్టల్‌లో గురువారం స్నానపుగదులు, విద్యార్థులు నిద్రించే గదులు, మరుగుదొడ్లు, పరిసరాల్లో మలాథియాన్ స్ప్రే చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనట్లు వివరించారు. తొలకరి జల్లులు పడుతుండడంతో దోమలు చేరే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. దోమలతో మలేరియా, విషజ్వరాలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు సమతుల పౌష్టికాహారం



ర్యాలీ చేస్తున్న పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సమతుల పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్ భారతి అన్నారు. మండలంలోని కొత్తవీరాపురం, మోదుగులపాలెం, కుమ్మరిమిట్ట ఎస్టీ కాలనీలో గురువారం అంగన్‌వాడీ బాట కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆరేళ్ల లోపు ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరి్పంచాలన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతోపాటు కోడిగుడ్లు అందజేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వైష్ణవి, భారతి, శారద, నాగభూషణమ్మ, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మజాతర





ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మ తల్లి, అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లిలో గురువారం గంగమ్మజాతర ఘనంగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి గంగమ్మను మేళతాళాలతోనడివీధిలో ప్రతిష్టించారు. భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున దీప,ధూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పార్టీలకు అతీతంగా గ్రామస్థులు ఏకమై బంధుమిత్రులతో కలసి జాతర మహోత్సవాన్ని వైభవోపేతంగా జరుపుకున్నారు. జాతరలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీసులు

- విధులకు వెళ్తుంటే దారిలో దొరికిన సెల్‌ఫోన్
- పోగొట్టుకున్న వ్యక్తి గ్రామానికే వెళ్లి అప్పగింత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న పోలీసులు

నాగలాపురం: దారిలో దొరికింది కదా అని సంబరపడి సెల్‌ఫోన్‌ను జేబులో వేసుకుని వెళ్లలేదు. ఆ ఫోన్ ఎవరిదో ప్రాథమిక విచారణలో తెలుసుకుని మరో గ్రామానికి వెళ్లి ఫోన్‌దారుడికి అప్పగించారు. శభాష్ పోలీసులు అనిపించుకున్నారు. వివరాలు..మండలంలోని బీరకుప్పం గ్రామానికి చెందిన నాగలాపురం హెడ్ కానిస్టేబుల్ ఇమ్మాన్యుయేల్, కానిస్టేబుల్ భూపతి విధుల నిమిత్తం బైకు మీద వెళ్తుండగా మార్గమధ్యంలో రోడ్డుపై ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటం గుర్తించారు. ఎవరి ఫ్యాంటు జేబులో నుంచో పడిపోయి ఉంటుందని గ్రహించారు. పోలీసులు ఆ మొబైల్ తీసుకుని అందులో చివరిగా కాల్ చేసిన వారికి ఫోన్ చేశారు. అవలి వ్యక్తితో మాట్లాడారు. ఆ ఫోన్ ఎస్ఎస్ పురం గ్రామానికి చెందిన వంశీది అని తెలుసుకున్నారు. ఆ తర్వాత పోలీసులు సరాసరి ఆ గ్రామానికే వెళ్లారు. వంశీని ప్రశ్నించి మొబైల్‌ను అందజేశారు. మొబైల్ తిరిగి ఇచ్చిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

బడి ఈడు పిల్లలను చేర్పించండి

- డ్రాపౌట్లను తిరిగి స్కూళ్లలో చేర్పించిన ఎంఈఓ



తొట్టంబేడు: తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, సీఆర్పీలు



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ కోరారు. గురువారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీ తంగెళ్లపురం గిరిజన కాలనీలో పర్యటించారు. బడి కి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను పాఠశాలకు పంపించాలని, చదువు ప్రాముఖ్యతను వారికి తెలియజేశారు. అలాగే ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఇవ్వడంతోపాటు మధ్యాహ్నం రుచికరమైన భోజనం పెడుతున్నట్లు అవగాహన కల్పించారు. ఆపై వారిని స్కూళ్లలో చేర్పించారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

తొట్టంబేడు : బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లాలని మండల విద్యాశాఖాధికారులు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. శ్రీకాళహస్తి అర్బన్ పరిధిలో ని భరద్వాజ గిరిజన కాలనీలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయటి పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తిచేసిన పిల్లలందరూ విధిగా ఆరోతరగతి చేరేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల కు అందుతున్న వసతులను వివరించారు. పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఉంటే హాస్టల్ వసతి కలిగిన పాఠశాల్లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటా మని తల్లిదండ్రులకు వివరించారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పక బడికి పంపేందుకు కృషి చేయాల ని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సీఆర్పీలు మోహన్, శాంతి, లలిత, ప్రసాద్, గాంధీ, స్వప్న, హేమలత పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలో చేర్చండి

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని సర్పంచ్ మోహనప్రియ తెలిపారు. మండలంలోని ఎండీ పుత్తూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలని సూచించారు. ఎస్టీ కాలనీల్లో విద్యార్థులు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. విద్యతో ఆర్థిక అక్షరాస్యతను సాధించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొరస్వామి, పంచాయతీ కార్యదర్శి లోకముని, ఉపాధ్యాయురాలు సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లను గుర్తించేందుకు సర్వే

నాగలాపురం: మండలంలోని కొట్టకాడు పంచాయతీ బాలకృష్ణాపురం ఎస్టీ కాలనీలో గురువారం తహసీల్దార్ డి.నరసింహులు, ఎంపీడీఓ పీఎంకె బాబు, విద్యాశాఖాధికారి బాబయ్య, జనార్ధనరాజు ఆధ్వర్యంలో డ్రాపౌట్లను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. బడికి దూరమైన బడిఈడు పిల్లలందరినీ గుర్తించి తిరిగి బడిలో చేర్పించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇదే విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయనేది తెలియజేయాలని, అలాగే పిల్లలకు స్కూళ్లకు ఉచితంగా ఇస్తున్న యూనిఫాం, బుక్స్, మధ్యాహ్న భోజనం గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీహరి, ఉపాధ్యాయులు శ్రీ భూషణం, ముని, సీఆర్‌పీ శివయ్య తదితతులు పాల్గొన్నారు.



ఏర్పేడు: పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ మోహనప్రియ



కొట్టకాడులో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్న తహసీల్దార్